ప్రభుత్వ లక్ష్యాలను సాధించాలి

- రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ కార్యదర్శి డీ.ఎన్ లోకేష్ కుమార్

కలెక్టరేట్, మార్చి 27: సెర్ప్ కింద నిర్దేశించుకున్న లక్ష్యాలను సకాలంలో సాధించేందుకు అధికారులు కృషి చేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ కార్యదర్శి డీ.ఎన్ లోకేష్ కుమార్ ఆదేశించారు. సెర్ప్ కార్యక్రమాలపై సెర్ప్ సీఈఓ డీ దివ్యతో కలిసి హైదరాబాద్ నుంచి అన్ని వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ యాసంగి మార్కెటింగ్ సీజన్‌లో సెర్ప్ ద్వారా ఏర్పాటు చేయబోయే ఐకేపీ కొనుగోలు కేంద్రాల సంఖ్య గణనీయంగా పెంచాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారని తెలిపారు. ప్రస్తుతం 33శాతం ఉన్న కేంద్రాలను ఈ సీజన్ నుంచి 50 శాతానికి పెంచేలా ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. అదనపు దిగుబడులు వస్తే స్వశక్తి మహిళా సంఘాల ఆధ్వర్యంలో సెంటర్లు ప్రారంభించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలకు అవసరమైన తేమ శాతం యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు, వేయింగ్ యంత్రాలు, ఇతర సామగ్రి అందించాలన్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేసినందుకుగాను మహిళా సంఘాలకు ఇవ్వాల్సిన పెండింగ్ కమీషన్ల చెల్లింపులు వెంటనే పూర్తయ్యేలా చూడాలని, గన్నీ బ్యాగులు రీకన్సిలేషన్ ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా ప్రతి మండలంలో గోదాముల నిర్మాణానికి సంకల్పించారని, ప్రస్తుతం ఏ మండలాల్లో గోడౌన్లు లేవు గుర్తించి అక్కడ నిర్మించేందుకు అవకాశాలను పరిశీలించాలని కలెక్టర్‌కు సూచించారు. దివ్యాంగులకు యూడీఐడీ కార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్డీవో శేషాద్రి, మెడికల్ సూపరింటెండెంట్ లక్ష్మీనారాయణ, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ రజిత, డీసీఎస్‌వో వసంత లక్ష్మి. ఎల్‌డీఎం మల్లికార్జున్, అధికారులు పాల్గొన్నారు.

భక్తుల ఇంటికే రాములోరి తలంబ్రాలు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్గో ఏటీఎం రామారావు

కలెక్టరేట్, మార్చి 27: శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రుల కల్యాణం తలంబ్రాలను భక్తుల ఇంటి వద్దకే ఆర్టీసీ కార్గో ద్వారా అందిస్తామని కార్గో ఏటీఎం రామారావు తెలిపారు. గురువారం సిరిసిల్ల పాత బస్ స్టేషన్ కార్గో కౌంటర్‌లో తలంబ్రాల బుకింగ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడారు. స్వామివారి కల్యాణానికి వెళ్లలేని భక్తులు తలంబ్రాల బుకింగ్ కోసం సిరిసిల్ల బస్టాండ్‌లోని కార్గో కార్యాలయంలో, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ వద్ద, ఏజెంట్ల వద్ద రూ.151 చెల్లించి బుకింగ్ రశీదు పొందాలని తెలిపారు. కల్యాణ అనంతరం ఇంటికే తలంబ్రాలు పంపిస్తామన్నారు. బుకింగ్ కోసం 9154298576, 9154298577, 9492448189 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కార్గో రిజినల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రాజు, శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియపరచటం ఏమనగా నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, వేములవాడ శాఖ గారు. శ్రీ బానోత్ అంజయ్య, S/o పాండ్యానాయక్, R/o. రుద్రంగి గ్రామం మరియు మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లా గారికి వ్యాపార నిమిత్తం ఋణ సదుపాయం కల్పించుచున్నారు. ఇట్టి విషయములో తన యొక్క స్వంత ఆస్తి అయిన ఖాళీస్థలం, దీని యొక్క విస్తీర్ణం: 484 చ.గజాలు, మరియు దీని యొక్క సర్వే నెంబరు: 92/అ/J/2/1/2/2, రుద్రంగి రెవెన్యూ గ్రామం మరియు మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లాలో గల దానిని నా క్లయింట్‌కు పై ఋణ విషయములో తనఖాగా పెట్టి పై ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు అప్పగించినారు. కావున ఇట్టి ఆస్తిపై ఎవరికైనా ఎలాంటి హక్కులు కానీ ఆక్షేపనలు కానీ వ్యాజములు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన 5 దినముల లోగా తగు దస్తావేజులతో నా కార్యాలయమునకు వచ్చి సంప్రదించగలరు. లేనిచో ఎవరికి అభ్యంతరాలు లేవని ధృవీకరించబడును.

తేది: 28-03-2025 స్థలము: సిరిసిల్ల.

ఇట్లు: Sd/- సి.హెచ్. మహేశ్ గౌడ్
న్యాయవాది బి.ఎస్‌సి., ఎల్.ఎల్.బి.,
సిద్దర్థనగర్, సిరిసిల్ల, జి|| రాజన్న సిరిసిల్ల.

నమస్తే తెలంగాణ CLASSIFIED

HOUSE FOR SALE

★ కమర్షియల్ బిల్డింగ్ అమ్మబడును, కరీంనగర్ విద్యారణ్యపురి రోడ్ నెం-1 లోని ఆర్యన్ హాస్పిటల్ వెనుక బిల్డింగ్ 4 గుంటలు అమ్మబడును. Cont: ఆర్యన్ హాస్పిటల్ నందు సంప్రదించగలరు.

NTK-0000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

ఆగని నిర్బంధకాండ

సిరిసిల్లరూరల్: తంగళ్లపల్లి ఠాణాలో మాజీ సర్పంచ్‌ల ఫోరం జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మధు, మాజీ సర్పంచులు

- మాజీ సర్పంచులపై సర్కారు ఉక్కుపాదం
- అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా ముందస్తు అరెస్టులు
- వేకువజామునే ఎక్కడ దొరికితే అక్కడ అదుపులోకి
- ప్రభుత్వ తీరుపై మాజీ సర్పంచుల ఆగ్రహం

ఎల్లారెడ్డిపేట/ముస్తాబాద్/కోనరావుపేట/ రుద్రంగి/ చందుర్తి, మార్చి 27: మాజీ సర్పంచులపై ప్రభుత్వ నిర్బంధం కొనసాగుతున్నది. సమస్యలపై ప్రశ్నిస్తున్న వారి గొంతులను నొక్కేస్తున్నది. అప్పులు చేసి గ్రామాభివృద్ధి చేశామని, పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని మాజీ సర్పంచుల జేఏసీ పిలుపు మేరకు గురువారం అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న జిల్లాలోని మాజీ సర్పంచులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. వేకువజామున ఎక్కడ దొరికితే అక్కడ అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్లను తరలించగా, మాజీ ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ప్రజాపాలన కాదని, అరెస్టులతో తమ పోరాటాన్ని ఆపలేరని హెచ్చరించారు. పెండింగ్ బిల్లులు ఇచ్చేదాకా ఉద్యమాన్ని ఆపేదిలేదని తేల్చిచెప్పారు. ఎల్లారెడ్డిపేటలో భూక్యా శంకర్‌నాయక్, భూక్యా ప్రభునాయక్, కోల నర్సయ్య, అజ్మీరా తిరుపతి, మాలోత్ పూణ్యను అరెస్ట్ చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతుంటే పోలీసులతో ఇలా అరెస్ట్ చేసి, అణగదొక్కే ప్రయత్నం చేయడం సరికాదని తాడేపు ఎల్లం మండిపడ్డారు. ముస్తాబాద్ మండలంలో మాజీ సర్పంచుల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి తాడేపు ఎల్లం, గౌరవ సలహాదారులు సాకలి రమేశ్, లక్ష్మణ్‌ను అదుపులోకి తీసుకున్నారు. రుద్రంగి మండలంలో దేగావత్ తిరుపతి, గుగులోత్ గజన్‌లాల్, గుగులోత్ మోహన్‌ను అరెస్టు చేశారు. కోనరావుపేట మండలం ధర్మారం, మల్కపేట గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులను పోలీసులు ఠాణాకు తరలించారు. అరెస్టయిన వారిలో గున్నాల లక్ష్మణ్, ఆరె మహేందర్ ఉన్నారు. చందుర్తి మండలంలోని పలు గ్రామాల మాజీ సర్పంచులు కమలాకర్ రావు, దప్పుల అశోక్, ఏనుగుల శ్రీనివాస్, సిరికొండ శ్రీనివాస్‌ను పోలీసులు అరెస్ట్ చేసి, ఠాణాకు తరలించారు. కాగా, పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని తాజా మాజీ సర్పంచుల జేఏసీ అధ్యక్షుడు దమ్మ అంజయ్య డిమాండ్ చేశారు.

ఎల్లారెడ్డిపేట: ఠాణా ఎదుట మాజీ సర్పంచ్‌లు

ముస్తాబాద్: ఠాణా ఎదుట మాజీ సర్పంచ్‌లు

బిల్లులు వెంటనే ఇవ్వాలి: రాష్ట్ర సర్పంచ్‌ల జేఏసీ మాజీ ఉపాధ్యక్షుడు మధు

సిరిసిల్ల రూరల్, మార్చి 27: సర్పంచుల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని మాజీ సర్పంచుల ఫోరం తెలంగాణ రాష్ట్ర జేఏసీ ఉపాధ్యక్షుడు మాట్ల మధు డిమాండ్ చేశారు. తంగళ్లపల్లి మండలంలోని మాజీ సర్పంచుల నివాసాలకు పోలీసులు ఉదయాన్నే వెళ్లి అరెస్టు చేసి ఠాణాలకు తరలించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ బిల్లులు చెల్లించాలని కొంతకాలంగా మాజీ సర్పంచులు పోరాటం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విసిగి వేసారి చేసేదేమి లేక అసెంబ్లీ ముట్టడికి తరలివెళ్తున్న తమను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. అక్రమ అరెస్టులు చేయడమేనా ప్రజాపాలన అని ప్రశ్నించారు. ఇక్కడ రాజన్న సిరిసిల్ల జిల్లా జేఏసీ ప్రధాన కార్యదర్శి గనప శివ జ్యోతి, కార్యవర్గ సభ్యులు కొయ్యాడ రమేశ్, సురభి నవీన్ రావు ఉన్నారు. మాజీ సర్పంచుల అరెస్టు నేపథ్యంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గజ భీంకార్ రాజన్న, మాజీ జడ్పీటీసీ కోడి అంతయ్య, గణప మదన్, ప్రేమ్ కుమార్, పార్టీ నేతలు ఠాణాలకు వెళ్లి సంఘీభావం తెలిపారు.

రైల్వే భూ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించండి

- రైల్వే శాఖ మంత్రికి ఎంపీ రవిచంద్ర విజ్ఞప్తి

రైల్వే మంత్రి వైష్ణవ్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎంపీ రవిచంద్ర

వేములవాడ, మార్చి 27: వేములవాడలో రైల్వే భూ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్‌కు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర విజ్ఞప్తి చేశారు. దక్షిణకాశీగా పేరొందిన వేములవాడ నిత్యం వేలాది మందితో కిటకిటలాడుతున్నదని, దినదినాభివృద్ధి చెందుతున్నదని చెప్పారు. గతంలోనే ఇక్కడ కొత్తగా రైల్వేలైన్, స్టేషన్ కోసం విలువైన భూములను అధికారులు సేకరించారని వివరించారు. ఇప్పటి వరకు అక్కడ ఎటువంటి పనులు మొదలు కాలేదని, పంటలు వేయలేక, క్రయవిక్రయాలు చేయలేక 300 మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గతంలో చాలా తక్కువ మొత్తంలో పరిహారం అందించారని, ప్రస్తుత మార్కెట్ ధర ఎకరాకు రూ.3 కోట్లు ఉందని, ఆ విధంగా నష్ట పరిహారం అందించి న్యాయం చేయాల్సిందిగా బాధిత రైతుల పక్షాన రైల్వే మంత్రిని కోరానని, కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారని రవిచంద్ర తెలిపారు. రైతులకు న్యాయం జరిగేలా తగు చర్యలు తీసుకుంటానని హామీనిచ్చినట్లు వివరించారు.

పకడ్బందీగా హార్వెస్ట్ చేయాలి

ఇల్లంతకుంట, మార్చి 27: యాసంగి ధాన్యం కోతలు దగ్గరపడుతున్నందున హార్వెస్టర్ యజమానులు, డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలని, పకడ్బందీగా హార్వెస్ట్ చేయాలని తహసీల్దార్ ఫారుక్, ఎంపీడీవో శశికళ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో హార్వెస్టర్ యజమానులు, డ్రైవర్లకు అవగాహన కల్పించారు. హార్వెస్టర్ మిషన్‌ను 18 నుంచి 19 ఆర్పీఎం పైన నడిపితే తాలు గింజలు, దుమ్ము వేరు చేయడానికి వీలవుతుందన్నారు. ఎప్పుడు బ్లోయర్లను ఆక్టివ్ మోడ్‌లో ఉంచుకోవాలని, అప్పుడే ధాన్యం నాణ్యతగా వస్తుందని చెప్పారు. రైతులు ధాన్యం పూర్తిగా ఎండిన తర్వాతనే కోతలు చేపట్టాలన్నారు. ఇక్కడ మండల వ్యవసాయ అధికారి సురేశ్ రెడ్డి, ఎఈవోలు, హార్వెస్టర్ యజమానులు పాల్గొన్నారు.

కోతకు వచ్చాకనే యంత్రాలు వినియోగించాలి

వీర్నపల్లి, మార్చి27: వరి పూర్తిగా కోత దశకు వచ్చిన తర్వాతనే యంత్రాలు కోతకు వినియోగించాలని తహసీల్దార్ ముక్తర్‌పాషా, ఏవో జయ సూచించారు. మండలకేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని హార్వెస్టర్ యాజమానులతో సమావేశమై, మాట్లాడారు. వరి పచ్చిగా ఉన్నప్పుడు కోయవద్దని, కోతకు వచ్చిన తర్వాత హార్వెస్ట్ చేస్తే తేమశాతం, తాలు, గడ్డి లేకుండా నాణ్యమైన దిగుబడి వస్తుందని చెప్పారు. కాగా, హర్వెస్టర్లకు రోడ్డు పన్నులు మినహాయించాలని యాజమానులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఆర్ఐలు ప్రవీణ్, శివకుమార్, ఏపీవో నర్సయ్య ఉన్నారు.

ప్రతి బుధవారం ఉచిత కంటి పరీక్షలు

బోయినపల్లి, మార్చి 27(వేములవాడ): కొదురుపాక గ్రామంలోని బీసీఎం కంటి దవాఖానలో ఏప్రిల్, మే నెలలో ప్రతి బుధవారం ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు వైరాగ్యం రాజలింగం, రీట బహదురాషా పేర్కొన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశాలతో గ్రామాల్లో కాకుండా దవాఖానలోనే ప్రతి బుధవారం ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తామని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మహిళా సాధికారతకు కృషి చేయాలి

ఎల్లారెడ్డిపేట, మార్చి 27: మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని ఏపీఎం మల్లేశం పేర్కొన్నారు. గురువారం స్త్రీశక్తి భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున సంఘాల పుస్తకాల్లో అన్ని వివరాలు నమోదు చేసి ఆడిటింగ్‌కు సిద్ధంగా ఉండాలన్నారు. మహిళలకు పౌష్టికాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా లాంటి అంశాలపై స్వయం సహాయక గ్రూపు మహిళలకు వీవోఏలు అవగాహన కల్పించాలని సూచించారు. ఇక్కడ మండల సమాఖ్య అధ్యక్షురాలు బైరి జ్యోతి, సీసీలు ఉన్నారు.

సెస్ చైర్మన్ పరామర్శ

గంభీరావుపేట, మార్చి 27: నర్మాలకు చెందిన ఎంగ్రల సుశీల ఇటీవల మృతిచెందగా, బాధిత కుటుంబాన్ని గురువారం సెస్ చైర్మన్ చిక్కాల రామారావు పరామర్శించారు. ఆయన వెంట సెస్ డైరెక్టర్ గౌరినేని నారాయణరావు, నేతలు కమ్మరి రాజారాం, ద్యానబోయిన రాజేందర్, రాజేశ్వర్‌రావు, రత్నాకర్, సుభాష్ ఉన్నారు.

యూట్యూబర్లపై దాడి

చందుర్తి,మార్చి 27: ఓ ఫోక్ సాంగ్ చిత్రీకరణ కోసం నర్సింగాపూర్‌కు వచ్చిన యువతులపై గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో పాటు మరో ఇద్దరు వ్యక్తులు దాడి చేసిన ఘటన బుధవారం రాత్రి జరిగింది. గ్రామస్తులు, స్థానికుల కథనం ప్రకారం హైదరాబాద్, గజ్వేల్, కరీంనగర్, జగిత్యాలకు చెందిన యువతులు ఫోక్ సాంగ్ చిత్రీకరణ కోసం నర్సింగాపూర్‌కు వచ్చారు. షూటింగ్ పూర్తయిన అనంతరం గ్రామానికి చెందిన సమీప బంధువుల ఇంట్లో విడిది చేశారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన గంగాధర్ అనే వ్యక్తితో పాటు మరో ఇద్దరు మద్యం మత్తులో అక్కడికి వచ్చి యువతులపై దాడి చేయడంతో పాటు అసభ్యంగా ప్రవర్తించినట్లు తెలిపారు. సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకున్నారు. యువతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అంజయ్య వెల్లడించారు. కాగా, రాజకీయ నేతల అండతో కేసును నీరుగార్చే ప్రయత్నం జరుగుతున్నదనే ప్రచారం గ్రామంలో జోరుగా జరుగుతున్నది.

తైబజార్‌కు వేలం

ఎల్లారెడ్డిపేట, మార్చి 27: మండల కేంద్రంలో తైబజార్, 16 దుకాణాల సముదాయానికి గురువారం పంచాయతీ ఆవరణలో వేలం నిర్వహించినట్లు కార్యదర్శి ప్రవీణ్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన జవ్వాజి రామస్వామి రూ.5.11లక్షలకు తైబజార్‌ను దక్కించుకోగా, 16 దుకాణాల్లో 12 దుకాణాలు రూ.1050 చొప్పున అద్దెకు పలువురు దక్కించుకున్నారని చెప్పారు.

పరిహారం అందించాలి

ఆర్డీవో రాజేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కోనరావుపేట, మార్చి 27: మల్కపేట రిజర్వాయర్‌లో భూములు కోల్పోతున్న తమకు పరిహారం అందించాలని గ్రామానికి చెందిన రైతులు గురువారం ఆర్డీవో రాజేశ్వర్‌రావుకు వినతి పత్రం అందజేశారు. కాళేశ్వరం ప్యాకేజీ-9లో భాగంగా కుడి కాలువ కింద సుమారు 45 ఎకరాల వరకు పట్టా భూమి నష్టపోతున్నామని, క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టపరిహారం అందించాలని కోరారు.

మాతా శిశు సంక్షేమంపై దృష్టి పెట్టాలి

- జిల్లా వైద్యాధికారి డా.ఎస్ రజిత

కలెక్టరేట్, మార్చి 27: మాతా శిశు సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా వైద్యాధికారి డా.ఎస్ రజిత సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో హెచ్‌పీలకు(మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్) హెల్త్ ప్రొవైడర్లు గ్రామస్థాయిలో అందించే ఆరోగ్య సేవలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాతా శిశు సంరక్షణ కార్యక్రమంలో గర్భిణులు, పాలిచ్చే తల్లులు తీసుకోవాల్సిన పోషకాహారం, ఐదేండ్లలోపు పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఇంకా మధుమేహం, రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు, ఓరల్, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్, టీబీ వ్యాధితో బాధపడే వారి వివరాలు, వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ అంజలినా ఆల్ఫ్రెడ్, డాక్టర్ సంపత్ కుమార్, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ అనిత, డీడీయం కార్తీక్, డిపిఓ రాజేందర్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలను నిర్మూలించాలి

కలెక్టరేట్, మార్చి 27: అన్ని శాఖల అధికారుల సమన్వయంతో మాదక ద్రవ్యాలను నిర్మూలించాలని కలెక్టర్ సందీప్ కుమార్‌ఝూ ఆదేశించారు. గురువారం సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్, ఎస్పీ మహేశ్ బి గితే సమక్షంలో జిల్లా స్థాయి నార్కో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని, వీటికి అలవాటు పడితే ఆర్థికంగా, ఆరోగ్య పరంగా, అనేక ఇబ్బందులు తప్పవని సూచించారు. డ్రగ్స్ వినియోగం దుష్ప్రభావాల గురించి యువతకు అవగాహన కల్పించేందుకు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియాల ద్వారా, అలాగే డిగ్రీ, జూనియర్ కళాశాలలు, పాఠశాలలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. వ్యాసరచన, డిబేట్ పోటీలు నిర్వహించాలని తెలిపారు. అనంతరం ఎస్పీ మహేశ్ బి గితే మాట్లాడారు. అన్ని శాఖల సమన్వయంతో ముందుకు వెళ్లి గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేస్తామని తెలిపారు. ఇక్కడ సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు సమ్మయ్య, అన్వేష్, జిల్లా వైద్యాధికారి రజిత, ఇంటర్మీడియట్ విద్యాధికారి శ్రీనివాస్, కార్మిక శాఖ అధికారి నజీర్ అహ్మద్, డీఏఓ అఫ్జల్ బేగం, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష పాల్గొన్నారు.

మంచినీటి సమస్యను పరిష్కరిస్తాం

ముస్తాబాద్, మార్చి 27: మండలకేంద్రంలోని దళితవాడలో నీటి సమస్యపై అధికారులు స్పందించారు. వారం రోజులు మంచి నీరు రాక ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు రెండ్రోజుల కింద ఖాళీ బిందెలతో ధర్నా చేయగా, అధికారులు తాగు నీటి సరఫరాకు చర్యలు చేపట్టారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ సైతం దళిత కాలనీలో గురువారం పర్యటించారు. వివరాలు సేకరించారు. అధికారులు స్థానికంగా ఉంటూ సమస్య తలెత్తకుండా చూడాలని ఆదేశించారు.

దైవదర్శనానికి వెళ్లొస్తూ..

- రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఎల్లారెడ్డిపేట, మార్చి 27: కొండగట్టు అంజన్న దర్శనానికి వెళ్లొస్తూ రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన ఘటన రాజన్నపేటలో విషాదాన్ని నింపింది. స్థానికులు, కుటుంబ సభ్యులు అందించిన వివరాల ప్రకారం రాజన్నపేటకు చెందిన శివరాత్రి లింగం-రజిత దంపతులు తమ కొడుకు సాయికృష్ణతో కలిసి గురువారం ఉదయం కొండగట్టుకు వెళ్లారు. మొక్కులు చెల్లించుకుని టాటా ఏస్ వాహనంలో కూర్చునేందుకు ప్రయత్నించగా అందులో పరిమితికి మించిన ప్రయాణికులు ఉండడంతో సాయికృష్ణ, మరో ప్రయాణికుడు వాహనం టాప్‌పై కూర్చున్నారు. ఘాట్ రోడ్డుపై తిరుగు ప్రయాణంలో స్పీడ్ బ్రేకర్ రావడంతో డ్రైవర్ ఆకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో టాప్‌పైన ఉన్న సాయికృష్ణ, మరో యువకుడు ఎగిరి వాహనం ముందు పడిపోయారు. అయితే సాయికృష్ణ పై నుంచి వాహనం వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. కరీంనగర్ తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అప్పటి వరకు తమతో ఉన్న కొడుకు కండ్ల ముందే విగతజీవిగా మారడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

గ్రామాల్లో తాగునీటి సమస్యలు రావద్దు

పోతుగల్ పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

- భగీరథ నీటి సరఫరా విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ
- చిప్పలపల్లి, నామాపూర్, పోతుగల్‌లో పర్యటన

ముస్తాబాద్, మార్చి 27: గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా చూడాలని, మిషన్ భగీరథ నీటి సరఫరా విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ ఆదేశించారు. ముస్తాబాద్ మండలకేంద్రంతోపాటు నామాపూర్, చిప్పలపల్లి, పోత్గల్‌లో గురువారం ఆకస్మికంగా పర్యటించారు. ముందుగా చిప్పలపల్లి గ్రామంలో మిషన్ భగీరథ అధికారులతో కలిసి కలియదిరిగారు. వాటర్ ట్యాంకులను పరిశీలించారు. నీటి సరఫరా పై ఆరా తీశారు. డిమాండ్ ఎంత? సరఫరా ఎంత అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాగా, తమ గ్రామంలో నీటి సమస్య తీవ్రంగా ఉందని పలువురు గ్రామస్తులు కలెక్టర్‌కు విన్నవించగా, పరిష్కరిస్తామని చెప్పారు. అనంతరం నామాపూర్ మోడల్ స్కూల్‌ను సందర్శించారు. ఆహార పదార్థాలు భద్రపరిచే స్టోర్ రూంను పరిశీలించారు. ఆహార పదార్థాలు నిల్వ ఉంచే విధానంపై వార్డెన్‌కు పలు సూచనలు చేయడంతోపాటు నిర్లక్ష్యంచేస్తే బదిలీ తప్పదని హెచ్చరించారు. ప్రిన్సిపాల్‌కు పలు విషయాలపై దిశానిర్దేశం చేశారు. స్కూల్ చుట్టూ ప్రహరీ, సోలార్ పెన్సింగ్ అమర్చాలని, క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. అనంతరం ముస్తాబాద్‌లోని డబుల్ బెడ్రూం ఇండ్ల ప్రాంతం, ఎస్సీ కాలనీలో పర్యటించి, నీటి సరఫరాపై వివరాలు సేకరించారు. స్థానికులు నీటి సమస్యలపై కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. కలెక్టర్ వెంటనే స్పందించి, వేసవిలో తాగు నీటి సమస్య రాకుండా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. తర్వాత పోత్గల్‌లోని పీహెచ్‌సీని తనిఖీ చేశారు. వైద్య సేవలు ఎలా అందుతున్నాయని పలువురు పేషంట్లను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది కొరత ఉందని, ఫర్నీచర్ లేదని సిబ్బంది పేర్కొనగా, త్వరలో నియమిస్తామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ అధికారులు జానకి, ప్రేమ్ కుమార్, రాము, తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఎంపీడీవో బీరయ్య, డాక్టర్ గీతాంజలి తదితరులు ఉన్నారు.

బీజేపీ నేతలవి చిల్లర మాటలు

- మరోసారి పునరావృతమైతే సహించం
- బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు బాబు

మాట్లాడుతున్న మండలాధ్యక్షుడు పసుల బాబు

సిరిసిల్ల టౌన్, మార్చి 27: బీజేపీ నేతలవి చిల్లర మాటలని, తెలంగాణ కోసం ఉద్యమించి, ఆంధ్ర పాలకులను తరిమికొట్టిన నాయకుడు సిద్దం వేణుపై అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామని బీఆర్ఎస్ ఎస్సీ సెల్ ఇల్లంతకుంట మండలాధ్యక్షుడు పసుల బాబు పేర్కొన్నారు. గురువారం సిరిసిల్లలోని ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. బీజేపీ నాయకులే చిల్లరగా మాట్లాడుతూ వారి జాతీయ పార్టీ స్థాయిని తగ్గించుకుంటున్నారని విమర్శించారు. తమ నాయకుడు కేసీఆర్ మాకు అలాంటి కుసంస్కారాన్ని నేర్పించలేదని, విలువలతో ఎలా జీవించాలో చెప్పారన్నారు. బండి సంజయ్ గొప్ప నాయకుడని ఆ పార్టీ నాయకులు మాట్లాడుతున్నారని, మరి ఆయన ఏనాడైనా పార్లమెంట్‌లో మాట్లాడడం చూశారా..? చెప్పాలని ప్రశ్నించారు. పదేండ్లు కరీంనగర్ ఎంపీగా పనిచేసి చేసింది శూన్యమని దుయ్యబట్టారు. తమ నాయకులపై బీజేపీ నాయకులు మాట్లాడినట్లుగా తాము కూడా దూషించగలమని, కానీ తమకు సంస్కారం అడ్డువస్తున్నదన్నారు. కనీసం వార్డు మెంబర్‌గా గెలవలేని, రాజకీయ అనుభవం లేని వ్యక్తులు తమ పార్టీ నాయకులను విమర్శిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు సిలువేరి చిరంజీవి, కంచర్ల రవిగౌడ్, మాజీ ఎంపీటీసీ పట్నం శ్రీనివాస్, గుంటి మధు, ముగ్దం అనిల్‌గౌడ్, పాల్గొన్నారు.

వేములవాడ దవాఖానలో కాయకల్ప బృందం

దవాఖానలో కాయకల్ప బృందం

వేములవాడ, మార్చి 27: వేములవాడ ఏరియా దవాఖానను కాయకల్ప బృందం గురువారం సందర్శించింది. ఘనపూర్ దవాఖానకు చెందిన వైద్య బృందం డాక్టర్ సంధ్య ఆధ్వర్యంలో పరిశీలించి, రోగులకు అందుతున్న సేవలు, పరిశుభ్రత తదితర అంశాలను అడిగి తెలుసుకున్నది. కాగా, గత మూడేండ్లుగా దవాఖాన రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలుస్తూ వస్తున్నదని, ఈ సారి కూడా అదే స్థాయిలో మార్కులు వస్తాయని ఆశిస్తున్నట్లు దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్య తెలిపారు. ఇక్కడ వైద్యులు రవీందర్, అనిల్ కుమార్, సంతోష్ చారి, సుభాషిణి, నర్సింగ్ సూపరింటెండెంట్లు అంజమ్మ, సుందరి, విజయ లక్ష్మి, సంజీత, బ్లోసమ్, ఝాన్సీ ఉన్నారు.

ఉపాధిహామీ సామాజిక తనిఖీ

- సిబ్బందికి నుంచి రూ.55వేల రికవరీకి ఆదేశం
- రూ.11వేల జరిమానా

చందుర్తి, మార్చి27: మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఆవరణలో 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. 1 ఏప్రిల్ 2023 నుంచి 31 మార్చి 2024 వరకు రూ.3 కోట్ల 77 లక్షల 30 వేల ఖర్చుతో వివిధ రకాల పనులు చేయగా, పది బృందాలతో ఈ నెల 15 నుంచి 27 వరకు ఎస్ఆర్పీ, డీఆర్పీ, వీఎస్ఏలు తనిఖీ చేసినట్లు అధికారులు చెప్పారు. డీఆర్పీలు మాట్లాడుతూ పలు గ్రామాల్లో కార్యదర్శుల సంతకాలు లేకుండానే పేమెంట్ చేశారన్నారు. పని ప్రదేశంలో పనుల గుర్తింపు సంబంధించిన బోర్డులు లేవన్నారు. ఎన్గల్‌లో భార్యభర్తలకు వేర్వేరుగా జాబ్ కార్డులు ఇచ్చారని, ఒకరి పేరుమీదనే ఉండాలని సిబ్బందికి సూచించారు. కాగా, మస్టర్లలో కూలీల సంతకాలు, రికార్డులు సక్రమంగా నిర్వహించని కారణంగా ఈజీఎస్ సిబ్బంది నుంచి రూ.55,392 రికవరీ చేయాలని, రూ.11వేలు జరిమానా విధించాలని సూచించారు. ఇక్కడ అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్ అరుణ్ రెడ్డి, అంబుడ్స్ మెన్ రాజేశ్, ఎంపీడీవో ప్రదీప్ కుమార్, ఏపీవో రాజయ్య, టీఏలు ఉన్నారు.